

ఆర్జీయూకేటీలో ఇండక్షన్ ప్రోగ్రాం

బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ మాట్లాడారు. 8లో▸



గుప్పుమంటున్న గుడుంబా

ఏజెన్సీ వ్యాప్తంగా గుడుంబా గుప్పుమంటోంది. ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/25.0

ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆలింకో, విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు మంగళవారం నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆలింకో సంస్థ 18ఏళ్లలోపు దివ్యాంగులకు అవసరమైన పరికరాలు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు దివ్యాంగుల నుంచి కొలతలు తీసుకున్నారు. అవసరమైన పరికరాలు త్వరలోనే అందించనున్నట్లు తెలిపారు. ఇందులో ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు రఘురమణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాలు షురూ



ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందుతున్న ఓ అభ్యర్థి

ఆదిలాబాద్‌టౌన్: ఆలిండియా కోటా కింద ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. రిమ్స్‌కు 15 సీట్లు కేటాయించగా, మంగళవారం ఒకరు అడ్మిషన్ పొందారు. సర్టిఫికెట్లను డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పరిశీలించారు. ఈనెల 22 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు దీపక్ పుష్కర్, ప్రశాంత్, సౌమ్య, జెస్సిక, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి,ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయాధికారి లలితాకుమారి ప్రకటనలో తెలిపారు. ఫస్టియర్‌లో ప్రవేశానికి గతేడాది పదో తరగతి రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అలాగే 5వ తరగతిలో ప్రవేశానికి గతేడాది 4వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకో వాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల వారికైతే రూ.2 లక్షలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తు సమయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు వీటీజీసెట్ హాల్‌టికెట్, 4వ, 10వ తరగతి మార్కుల ధ్రువ పత్రాలను జత చేయాలని సూచించారు. ఈనెల 20లోగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు

కైలాస్‌నగర్: కొబ్బరి బొండాల వ్యర్థాలను బయటపడేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాల వద్ద గల కొబ్బరిబొండాల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తాగి పడేసిన వాటిని నిల్వ చేసేందుకు ప్రత్యేక డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాటిని చెత్త తరలించే మున్సిపల్ వాహనాలకు అందించాలని, లేనిపక్షంలో విక్రయదారులే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకుని డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. రోడ్డుపై నిల్వచేసినా, ఇష్టారాజ్యంగా పడేసినా జరిమానాతో పాటు తోపుడుబండ్లను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, పట్టణ ప్రణాళిక అధికారిసుమలత తదితరులున్నారు.

అందుబాటులో ఉండి అత్యవసర సేవలందించాలి

ఆదిలాబాద్‌టౌన్: అత్యవసర సేవల్లో 108 సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్ అన్నారు. ఆదిలాబాద్‌అర్బన్ 108 వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. వాహనంలో పరికరాలు, ఇండెంట్, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట డీఐవో వైసీ శ్రీనివాస్, ఈఎంటీ రేఖ,వసీమ్, విఠల్‌గౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరానికి రూ.25వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, సంబంధిత శాఖ అధికారులతో సర్వే చేయించి త్వరగా పరిహారం అందేలా చూడాలని పేర్కొన్నారు.



రైతు గంగన్నకు ధైర్యం చెబుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పరిశీలన షురూ..

- జిల్లాను కుదిపేసిన భారీ వర్షాలు
- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- పంట నష్టంపై ప్రాథమిక అంచనా పూర్తి
- పలుచోట్ల పర్యటించిన ఇన్‌చార్జి మంత్రి 'జూపల్లి'
- మరమ్మతులపై సిద్ధమవుతున్న నివేదికలు
- పరిహారంపైనే అన్నదాత ఆశలు

వర్షపాతం వివరాలు.. (జూన్ 1 నుంచి ఆగస్టు 19 వరకు..)
సాధారణం : 714.7 మి.మీ.లు
కురిసింది : 812.9 మి.మీ.లు
వ్యత్యాసం : 14 శాతం అధికం
స్థితి : సాధారణం

పంట నష్టం వివరాలు.. (ప్రాథమిక అంచనా)
ప్రభావిత గ్రామాలు: 434
నష్టపోయిన రైతులు : 8,071
నష్టం: 20,608 ఎకరాలు
పంటల వారీగా .. (ఎకరాల్లో)
పత్తి: 15,103
సోయా: 2,900
కంది: 1,845
మొక్కజొన్న: 660
ఇతర పంటలు: 100

ఆర్‌అండ్‌బీ రోడ్ల నష్టం వివరాలు..
కోతకు గురైన రోడ్లు : 66 కి.మీ.లు
నష్టం సంభవించిన లోలెవల్ వంతెనలు : 22
కొట్టుకుపోయిన కల్వర్టులు : 30 చోట్ల
తాత్కాలిక మరమ్మతులకు అంచనా వ్యయం: రూ.3.15 కోట్లు
శాశ్వత నిర్మాణాలకు అంచనా వ్యయం: రూ.66.70 కోట్లు

పంచాయతీరాజ్ రోడ్ల నష్టం వివరాలు..
పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లు : 57(44 కి.మీ.లు)
కోతకు గురైన రోడ్లు: 27
కొట్టుకుపోయిన లోలెవల్ వంతెనలు: 34
తాత్కాలిక మరమ్మతుల కోసం అంచనా వ్యయం: రూ.3.80 కోట్లు
శాశ్వత నిర్మాణాలకు అంచనా వ్యయం: రూ.60.85 కోట్లు

సాక్షి,ఆదిలాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు జిల్లాను కుదిపేశాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సర్కారు పరిహారంపైనే రైతులు పెట్టుకున్నారు. మరోపక్క రోడ్లు సైతం కోతకు గురయ్యాయి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. గ్రామాల్లో కరెంట్ సరఫరాకు ఆటంకం ఎదురవుతోంది. ఇప్పటికే యంత్రాంగం క్షేత్రస్థాయికి తరలింది. తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సైతం నష్టాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

జిల్లాలో ఈనెల 13న 43 మి.మీ.లు, 17న 118, 19న 67.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇవే భారీ వర్షాలు. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి. వరద పోటెత్తింది. సమీపంలో ఉన్న పంట పొలాలను ముంచెత్తాయి. వరద ఉధృతికి రహదారులు కోతకు గురయ్యాయి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. కాగా ఈ నష్టాలకు సంబంధించి ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో మంగళవారం పర్యటించి వరద నష్టాన్ని పరిశీలించారు. పక్కా నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ దిశగా కలెక్టర్ రాజర్షిషా దృష్టి సారించారు. వివిధ శాఖల ద్వారా ఇప్పటికే ప్రాథమిక అంచనాతో పాటు శాశ్వత నిర్మాణాలకు అయ్యే ఖర్చులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూపొందించారు. ఆ నివేదికలను ప్రభుత్వానికి పంపించనున్నారు.

పంటలకు నష్టం..

వాగులు, వంకల సమీపంలో ఉన్న పంట పొలాల్లో భారీగా వరద నీరు చేరడంతో ఎదిగిన పంటలపై ప్రభావం చూపింది. మొక్కలు నేల వాలాయి. చేలల్లోకి రాళ్లు, రప్పలు, మట్టిదిబ్బలు, ఇసుక మేట వేయడంతో తీవ్ర నష్టం చేకూరింది. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న ఆవేదన రైతన్నల్లో కనిపిస్తోంది. జిల్లాలో అత్యధికంగా పత్తి పంటకు నష్టం చేకూరింది. అలాగే సోయా, కంది, మొక్కజొన్న తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పటికే వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. సర్వే తర్వాత నష్టంపై పక్కా నివేదిక రూపొందించనున్నారు.

దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు..

భారీ వర్షాలకు జిల్లాలోని పలు రోడ్లు, లోలెవల్ వంతెనలు దెబ్బతిన్నాయి. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి నష్టాలను అంచనా వేశారు. తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలకు ఎంతెంత వ్యయం అవుతుందనే నివేదికలు రూపొందించారు. విద్యుత్ శాఖకు సంబంధించి పలుచోట్ల స్తంభాలు పడిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఈ నష్టం రూ.11 లక్షల వరకు ఉంటుందని అంచనావేశారు. వీటిన్నింటికి సంబంధించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే మొత్తం నష్టానికి సంబంధించి పక్కా నివేదిక రూపొందించి ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. పూర్తి నష్టాన్ని అంచనా వేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. ఆ తర్వాత వచ్చే నిధులతో పనులు చేపట్టాల్సి ఉంటుంది.

మండలాల్లో వర్షపాతం స్థితి..

జైనథ్, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, సాత్నాల, సిరికొండ మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఇచ్చోడలో 60 శాతం అత్యధికంగా నమోదు కావడం గమనార్హం. ఇదిలా ఉంటే ఈ సీజన్‌లో ఆగస్టు మాసానికి సంబంధించి ఈనెల 19వరకు సాధారణ వర్షపాతం 181.4 మి.మీ.లు కాగా, 323.4 మి.మీ.లు కురిసింది. ఇది 78 శాతం అధికం. ఇదిలా ఉంటే ఈ మాసంలో ఏకంగా 11 రోజులు వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా వర్షపాతం సాధారణ స్థితికి చేరింది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- పంట నష్టం పరిశీలించిన మంత్రి 'జూపల్లి'

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి శివారులో వరద ముంచెత్తిన పంట చేలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పరిశీలించారు. గ్రామానికి చెందిన జక్కుల గంగన్న చేనును పరిశీలించిన ఆయన పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఆరెకరాల్లో పత్తి వేయగా అందులో నాలుగెకరాలు పూర్తిగా దెబ్బతిందని రైతు గోడు వెల్లబోసుకున్నాడు. అలాగే పొలమంతా కోతకు గురైందన్నాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నాడు. ఈమేరకు మంత్రి స్పందిస్తూ, నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఎవరూ అధైర్య పడవద్దన్నారు. అధికారులతో సర్వే చేయిస్తామన్నారు. అలాగే వరదలో కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌ను మంత్రి పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, ఏవో నగేశ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ముత్నూర్‌లో కోతకు గురైన రోడ్డు పరిశీలన..

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలో వరద తాకిడికి కోతకు గురైన ప్రధాన రహదారిని మంత్రి జూపల్లి పరిశీలించారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎమ్మెల్యే బొజ్జు, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

పారదర్శక నివేదిక అందించాలి



మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు, పక్కన ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యేలు బొజ్జు, శంకర్, అనిల్‌జాదవ్

- శాఖల వారీగా సర్వే పకడ్బందీగా చేపట్టాలి
- నష్టపోయిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగొద్దు
- అధికారులతో సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి 'జూపల్లి'

కైలాస్‌నగర్: వరదలతో నష్టపోయిన బాధితుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా సమగ్ర సమాచారంతో కూడిన పారదర్శక నివేదిక అందించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టం, సహాయక చర్యలపై జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా జరిగిన నష్టంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంటనష్టం, మూగజీవాలు, ధ్వంసమైన ఇళ్ల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నష్టాలను క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించాలని, ఇందుకు అవసరమైతే ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఏమైనా పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. నష్టంపై శాఖల వారీగా సమీక్షించి పూర్తి నివేదిక అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి, నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. చెరువులు, కుంటలు, కాలువలకు గండ్లుపడ్డ చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని, విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఈ ఏడాది మే 27న జైనథ్ మండలం లక్ష్మింపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు తర్నం వాగు దాటుతూ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య జ్యోతికి మంత్రి అందజేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో వరద ప్రభావానికి కూలిపోయిన ఇళ్లు, భారీగా ప్రవహించిన నాలాను మంత్రి పరిశీలించారు. 11 మంది బాధితులకు రూ.4వేల నగదు, 10 కిలోల సన్నబియ్యం చొప్పున మంత్రి అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్‌పై అసంతృప్తి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చాలా వరకు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాలు ప్రారంభించకపోవడంపై అధికారులు చెప్పిన సమాధానాలపై ఆయన విభేదించారు. మంజూరై ఇళ్ల నిర్మాణం చేపట్టని వారితో ఎమ్మెల్యేలతో కలిసి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థిక స్తోమత లేకనే చేపట్టకపోతే బ్యాంకులు, ఎస్‌హెచ్‌జీల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ రాజర్షిషా ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న మంత్రికి కలెక్టర్, ఎస్పీలు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు.

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం

ఆదిలాబాద్: ఫొటోలతో జ్ఞాపకాలు పదిలంగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్, విజయ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, అనిల్, మురళీధర్, సంతోష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

'సంక్షేమ' లబ్ధికి ఆరాటం

- 'మహాలక్ష్మి, గృహజ్యోతి' నమోదుకు అర్హుల ఆసక్తి
- సందడిగా ప్రజాపాలన ప్రత్యేక కేంద్రం

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వీటికోసం గతంలో ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసి ఉండి ఇటీవల కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారంతా ఆరాటపడుతున్నారు. ఇలాంటి వారి వివరాల సేకరణ కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. ఇటీవల వరుస సెలవులు రావడంతో దరఖాస్తుదారులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రేషన్ కార్డులు పొందిన వారంతా సంక్షేమ పథకాల అమలు కోసం క్యూ కట్టారు. వారికి ఇబ్బందులు కలగకుండా బల్దియా అధికారులు అదనపు సిబ్బందిని నియమించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు సూచించారు.



రద్దీగా మారిన ప్రజాపాలన కేంద్రం

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 21న జిల్లాఅథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజా రెడ్డి, రాజేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్–14,16,18,20 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు ఉంటాయని తెలిపారు. పాల్గొనదలచిన క్రీడాకారులు రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వయసు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని, వివరాలకు 9492136510లో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన వారు ఈనెల 30, 31 తేదీల్లో మహబూబ్ నగర్ వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

దగ్గు.. జ్వరం.. నొప్పులు

- ముసురుకుంటున్న సీజనల్ వ్యాధులు
- రిమ్స్‌లో పెరిగిన ఓపీ.. కిక్కిరిసిన వార్డులు
- ప్రైవేట్ ఆస్పత్రులు సైతం ఫుల్



రోగులతో కిక్కిరిసిన రిమ్స్ ఓపీ విభాగం



చిన్నారులతో కిటకిటలాడుతున్న పిల్లల వార్డు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రోగాలు ముసురుకుంటున్నాయి.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దగ్గు, జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో ఏ ఇంటికి వెళ్లినా ఒకరిద్దరు జ్వర పీడితులే కనిపిస్తున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా బాధపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తోపాటు ప్రైవేట్, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. రిమ్స్‌లో మంగళవారం ఓపీ విభాగంలో 2400 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పిడియాట్రిక్ వార్డులో సరిపడా బెడ్లు లేక ఒక్కో పడకపై ఇద్దరేసి చొప్పున ఉంచి చికిత్స అందించారు.

కిక్కిరిసిపోయిన పిడియాట్రిక్ వార్డు..

రిమ్స్‌లోని పిడియాట్రిక్ వార్డు చిన్నారులతో కిక్కిరిసిపోయింది. ఇటీవల బెడ్లన్నీ ఖాళీగా ఉండగా, వారం నుంచి నిండిపోయి కనిపిస్తున్నాయి. ఈ వార్డులో 70 బెడ్లు ఉండగా, 90 మంది వరకు చికిత్స పొందుతున్నారు. డెంగీ లక్షణాలు, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. సరిపడా బెడ్లు లేకపోవడంతో వైద్యులు ఒక్కో పడకపై ఇద్దరేసి చిన్నారులకు సేవలు అందిస్తున్నారు.

జ్వరాలతో విలవిల..

జిల్లాలో సీజనల్‌వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమలు, ఈగలు, కలుషిత నీటి కారణంగా జనం రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఎక్కువగా టైఫాయిడ్, వైరల్ జ్వరాలున్నాయి. జిల్లాలో ఈ నెలలో 19 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 50నమోదయ్యాయి. రిమ్స్‌తోపాటు ప్రైవేట్ ఆస్పత్రులూ రోగులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఇదే అదునుగా కొంత మంది అందినకాడికి దండుకుంటున్నారు. అవసరం లేకున్నా వైద్యులు టెస్టుల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

పారిశుధ్య నిర్వహణ లోపంతోనే...

ఇటీవల కురిసిన వర్షాలతో ఆయా ప్రాంతాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.గుంతలు, మురుగుకాలువలతో పాటు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో అందులో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతున్నాయి. ఫలితంగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది.

ఓపీ పెరిగింది..

రిమ్స్‌లో ఓపీ పెరిగింది. మంగళవారం 2400 మంది జ్వరాలతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యసేవలు పొందారు. పిల్లల వార్డులో 90 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. ఈ వార్డులో అదనంగా మరో 20 బెడ్లు ఏర్పాటు చేశాం. అలాగే 200 మంది చిన్నారులు ఓపీ ద్వారా చికిత్స పొందారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

శుభ్రత పాటించాలి..

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి. నిల్వ నీటిలో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయి. వాటి నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. జ్వరాల బారిన పడిన వారు సమీపంలోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

కినక వంశీయుల నవధాన్యాల పూజలు


సహపంక్తి భోజనం చేస్తున్న కినక వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండలో మంగళవారం కినక వంశీయులు నవధాన్యాల (నొవ్వోంగ్) పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక పూజల అనంతరం నవధాన్యాలతో నైవేద్యం తయారు చేసి కుల దేవతకు సమర్పించారు. కినక వంశీయులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కినక వంశీయులు కినక లచ్చు పటేల్, జుగాదిరావ్, మాన్కు పటేల్, దేవ్‌రావ్ కటోడ, సూర్యభాన్, యాదోరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 39 గేట్ల ఎత్తివేత

మామడ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మంగళవారం 2.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. అధికారులు ప్రాజెక్ట్ 39 గేట్లను ఎత్తి 3.25 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1089 అడుగుల (73.37 టీఎంసీలు) నీరు నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ దిగువన గోదావరినది పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు గోదావరిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నెన్నెల: కుమ్మరివాగు నుంచి బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్‌తో పాటు ఓనర్ గోలెం తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల తొలగింపు

- మరొకరికి చార్జ్‌మెమో

వేమనపల్లి: మండలంలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఫేక్ అటెండెన్స్ పంపించిన కారణంగా ప్రభుత్వం వారిని విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు డీపీవో కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సుంపుటం కార్యదర్శి వెంకటి, దస్నాపూర్ కార్యదర్శి రజిత, చామనపల్లి కార్యదర్శి యాదగిరిని విధుల నుంచి తొలగించగా ముల్కలపేట కార్యదర్శి సురేష్‌కు చార్జ్‌మెమో, ఎంపీడీవో కుమారస్వామికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సమయపాలన పాటించకుండా పాత ఫొటోను తీసి క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉన్నట్లు ఫేక్ అటెండెన్స్ పంపించడంతో ముగ్గురిపై వేటు పడింది.

వర్షానికి కూలిన ఇళ్లు


దస్తురాబాద్‌లో కూలిన ఇల్లు

దస్తురాబాద్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామానికి చెందిన గుండ లక్ష్మి, మండల కేంద్రంలోని గంప భారతకు చెందిన ఇల్లు కూలిపోయాయి. కూలిన ఇళ్లను తహసీల్దార్ విశ్వంబర్, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు.

సాత్నాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు భోరజ్ మండలంలోని ఆకోలి గ్రామానికి చెందిన ఆత్రం రంగనాథ్ ఇల్లు కూలింది. మంగళవారం అకస్మాత్తుగా గోడలు కూలిపోవడంతో ఇంట్లో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. కూలీపని చేసుకుని జీవనం సాగించే తమకు ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేదని, శాశ్వత గృహం మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత వాంగ్మూలం

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఫోన్‌ట్యాపింగ్‌లో భీమారం మండల కాంగ్రెస్ నేత పొడేటి రవి ఇటీవల సిట్ విచారణకు హాజరైనట్లు ఆలస్యంగా తెలిసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ నుంచి పిలుపు వచ్చిన మాట వాస్తవమేనని రవి 'సాక్షి'కి మంగళవారం తెలిపారు. ఈ మేరకు విచారణలో శాసనసభకు జరిగిన ఎన్నికల్లో చెన్నూర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నగదు తరలిస్తుండగా మందమర్రి ఏరియాలో ఎన్నికల అధికారులు పట్టుకున్నారు కదా అని, అప్పట్లో ఇబ్బందికరంగా ఏమైనా ఫోన్లు వచ్చాయా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిపారు. తాను కాంగ్రెస్‌పార్టీకి విధేయునిగా ఉన్నందునే అప్పటి ప్రభుత్వం తనఫోన్ ట్యాప్ చేయించిందని, ఈ విషయం అధికారులు తనకు చెప్పేంత వరకు తెలియదని అన్నారు.

వరదనీటితో పంటలకు ముప్పు

- జాగ్రత్తలు పాటించకుంటే నష్టం
- రాజశేఖర్, ఆదిలాబాద్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త


రాజశేఖర్, శాస్త్రవేత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 16.20 లక్షల ఎకరాల్లో వివిధ రకాలు పంటలు సాగయ్యాయి. ఇందులో అధికశాతం రైతులు పత్తి సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. పత్తి, వరి, సోయా, కంది పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరద నీటితో పంటల్లో మట్టి, ఇసుక మేటలు వేసి తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. దీంతో చేనులోంచి నీటిని పంపించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు నీటి పదను ఎక్కువై మొక్కలు జాలువారి పోతున్నాయి. పంటకు వేరుకుళ్లు, ఎండు తెగులు, ఆకుమచ్చ, కాండం కుళ్లు తెగుళ్లు సోకడంతో ఆకులు పసుపు వర్ణం, ఎర్రబారిపోవడంతో పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల రైతులు ఈ సమయంలో అప్రమత్తంగా ఉండి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, పంటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ సూచిస్తున్నారు.


భీమిని మండలంలో పత్తి పంటలో వరద నీరు

పత్తి పంటలో..

- పంట చేలల్లో కాల్వలు తీసి నీటిని బయటకు పంపించాలి. వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలి. దీనివల్ల భూమిలో తేమ తగ్గి వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కకు 5 నుంచి 6 సెంటీమీటర్ల దూరంలో గుంతలు తీసి వేయాలి. లేదా అంతరకృషి చేయాలి.
- పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి. దీనివల్ల మొక్కల పెరుగుదల తగ్గుతుంది. కాబట్టి 20 గ్రాముల యూరియా లేదా పది గ్రాముల 20-20 లీటరు నీటిలో కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.

భూమి, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు పత్తిని ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బండిజమ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

ఆకుముడుత పురుగు

ఈ పురుగు ఆకుముడుతలో ఉండి పత్రహరితాన్ని హరించడంతో ఆకులు తెల్లబడుతాయి. దీని నివారణకు పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2 నుంచి 3 సార్లు లాగితే పురుగులు కిందపడిపోతాయి. ఆతర్వాత క్లోరిపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరాన్ నిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 20 డబ్ల్యూడీజీ 0.25 గ్రాములు లేదా 48 ఎస్సీ 0.1 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున వేయాలి.

వరి పంటలో..

వరి సాగు చేసిన రైతులు ఇప్పటికే నాట్లు వేసినట్లయితే పంటలో ఎక్కువ మోతాదులో నీరు ఉండకుండా చూడాలి. ముంపు పాలైన వరి పొలాల్లో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

తాటాకు తెగులు

హిస్పాపిల్లా పెద్దపురుగులు ఆకులోని పత్రహరితాన్ని గోకి తినడం వల్ల తెల్లటి చారలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరోపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొడతెగులు

ఆకులపై పాము పొడ మచ్చలుగా ఏర్పడి మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. దీని నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీలీటర్లు లేదా ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటర్ లేదా ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్+ టెబ్యుకొనజోల్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి చొప్పున రెండు సార్లు పిచికారీ చేయాలి.

అగ్గితెగులు

అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల లేదా ఐసోప్రోదయోలేన్ 1.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి


డ్రైవర్ అనిల్ మృతదేహం

నేరడిగొండ: బ్రిడ్జి పైనుంచి లారీ కిందపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇచ్చోడ సీఐ రాజు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ కంటైనర్ నేరడిగొండ మండలంలోని కుప్టి వంతెన వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనువతే అనిల్ (38) క్యాబిన్‌లోనే ఇరుక్కుని మృతి చెందాడు. మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని సీఐ తెలిపారు. ఎస్సై ఇమ్రాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

108లో ప్రసవం


కవల పిల్లలకు జన్మనిచ్చిన ప్రతిక్ష

ఇచ్చోడ: మండలంలోని ముఖరా బి గ్రామానికి చెందిన గర్భిణి ప్రతిక్షకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అనిల్ 108కు సమాచారం అందించాడు. అంబులెన్సులో ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాకేశ్, ఈఆర్‌సీపీ డాక్టర్ కౌశిరెడ్డి సలహా మేరకు వాహనంలోనే డెలివరీ చేశారు. మొదటికాన్పులో ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిచ్చింది. తల్లీపిల్లలు క్షేమంగా ఉండటంతో వారిని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పైలట్ వినోద్, ఈఎంటీ రాకేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

నీటి ప్రవాహంతో నిలిచిన బస్సు


ప్రయాణికులను వాగు దాటిస్తున్న ఎస్సై

భీంపూర్: మండలంలోని గోముత్రి, కరంజి గ్రామాలకు బయలుదేరిన బస్సు మంగళవారం రాత్రి అంతర్గామ వద్ద వాగు ఉప్పొంగి ప్రవహించటంతో మార్గమధ్యలో నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పీర్‌సింగ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకులతో కలిసి తాడు సహాయంతో ప్రయాణికులను వాగు దాటించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాగులు, వంకలను దాటవద్దని, అత్యవసర సమయంలో పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని ఎస్సై సూచించారు.

చిట్టీ డబ్బులు కాజేసిన మహిళపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: చిట్టీ డబ్బులు కాజేసిన మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ 20 మంది వద్ద నెలకు రూ.10 వేల చొప్పున చిట్టీ పేరిట డబ్బులు వసూలు చేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన ఒకరిపై..

లక్సెట్టిపేట: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఉట్నూర్ డిపోకు చెందిన డ్రైవర్ విజయేందర్‌పై దాడి చేసిన పట్టణానికి చెందిన దూడ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక అంబేద్కర్‌చౌక్ వద్దకు వచ్చి నా బైక్‌ను ఢీకొడతావా అని బూతులు తిడుతూ కొట్టడంతో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై..

ఇంద్రవెల్లి: గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. మండలంలోని రేపల్లివార్ అశోక్, రేపల్లివార్ లక్ష్మణ్, మోరే అజయ్ ప్రతీరోజు గంజాయి సేవిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు వారికి యూరిన్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు రిమాండ్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని సిరికల్చర్ కార్యాలయంలో జనరేటర్ చోరీ చేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్నూర్ మండలానికి చెందిన అరవింద్, ఉట్నూర్ మండలం లక్కారంకు చెందిన సందీప్ జనరేటర్‌ను చోరీ చేసి ఉట్నూర్ ఐబీ ప్రాంతంలోని పాత ఇనుప సామానులు కొనుగోలు చేసే దుకాణ యజమాని అబ్రార్‌కు విక్రయించినట్లు తెలిపారు. చోరీ చేసిన ఇద్దరితో పాటు కొనుగోలు చేసిన వ్యక్తిని సైతం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

దస్తురాబాద్: ఉజ్బెకిస్థాన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని మున్యాల గ్రామపంచాయతీలోని పెద్దూర్‌కు చెందిన సంగ సురేష్ (35) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 22న ఉజ్బెకిస్థాన్‌లో పనిచేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు.

తప్పిన ప్రమాదం


పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి నుంచి నిర్మల్ వెళ్లే ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. మంగళవారం పార్‌పెల్లి నుంచి నిర్మల్ బయలుదేరిన ఆర్టీసీ బస్సు పీచర-రాచాపూర్ గ్రామాల మధ్య అకస్మాత్తుగా ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ బస్సును నెమ్మదిగా రోడ్డు కిందకు దించాడు. లేదంటే పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లేదని ప్రయాణికులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం తప్పిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2025 సెప్టెంబర్ 23 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026, ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలిసి కట్టుగా కట్టారు..


రాళ్లకట్ట కడుతున్న గ్రామస్తులు

సిరికొండ: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రిమ్మ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తడంతో మంగళవారం రిమ్మ, తిమ్మాపూర్ గ్రామస్తులంతా కలిసి కట్టుగా కొట్టుకుపోయిన రోడ్డుతో పాటు రోడ్డు పక్కన గల రాళ్లకట్టకు ఇలా మరమ్మతులు చేశారు.

ఆర్జీయూకేటీలో ఇండక్షన్ ప్రోగ్రాం


వీసీకి పూలమొక్క ఇస్తున్న విద్యార్థిని

బాసర: బాసర ఆర్జీయూకేటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో పీయూసీ2 పూర్తి చేసుకుని ఇంజినీరింగ్‌లో విభాగంలో చేరిన కొత్త విద్యార్థులకు మంగళవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రత్యేక అతిథిగా ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి ఆర్జీయూకేటీలో 2025 పాఠ్యక్రమం అమలులోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కరికులం రూపకల్పన చేయబడిందని, అన్ని ఇంజినీరింగ్ బ్రాంచులకు సమాన ప్రాధాన్యత లభించేలా రూపొందించబడిందన్నారు. ఓఎస్డీ మాట్లాడుతూ మనం కేవలం ఉద్యోగాలు పొందడమే కాకుండా కొత్త ఉద్యోగాలను సృష్టించి దేశానికి సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అసోసియేట్ డీన్స్ డాక్టర్ మహేశ్, డాక్టర్ వీ.చంద్రశేఖర్రావు, సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ వెంకట్రామన్, తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు పీహెచ్‌డీ పట్టాలు


పట్టాలతో భాగ్యలక్ష్మి, ఉదయరాణి

బోథ్: ఉస్మానియా విశ్వవిద్యాలయం మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో మండలంలోని సొనాలకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఒకే వేదికపై పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో ఇర్ల భాగ్యలక్ష్మి తెలుగు సాహిత్యంలో పరిశోధన చేయగా ఆమె చెల్లెలు ఉదయరాణి చరిత్రలో పరిశోధన చేసింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణ, వైస్ ఛాన్సలర్ ఎం.కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. విద్యారంగంలో తమదైన ముద్ర వేసుకుంటూ, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఈ అక్కాచెల్లెళ్లు పలువురికి ఆదర్శంగా నిలిచారు. నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నతమైన లక్ష్యాలనైనా సాధించవచ్చని వారు పేర్కొంటున్నారు.

మెడికల్ బోర్డులో లోపాలు సరిచేయాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న జీఎల్‌బీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి మెడికల్ బోర్డులో లోపాలను సరిచేయాలని కోరుతూ జీఎల్‌బీకేఎస్ గౌరవ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి జీ.సీతారామయ్య మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మెడికల్ బోర్డులో అర్హులైన చాలామందిని అన్‌ఫిట్ చేయాల్సి ఉండగా ఫిట్ ఇచ్చి అన్యాయం చేశారన్నారు. చాలామంది కార్మికులు జబ్బులతో బాధపడుతున్నారన్నారు. తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించి ఫిట్ ఇచ్చిన వారిని తిరిగి స్క్రీనింగ్ చేయాలని కోరారు. అంతే కాకుండా పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ల ఉద్యోగాలను త్వరితగతిన సెటిల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస్, జీ.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి..కుమారుడికి వైద్యం అందించి


వాగు దాటుతున్న మెస్రం గంగారాం

ఇంద్రవెల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉప్పొంగడంతో హర్కపూర్ అంద్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ ఏ, మామిడిగూడ జీ గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించి పోయాయి. మంగళవారం వరద నీరు తగ్గడంతో మామిడిగూడ జీ గ్రామ పటేల్ మెస్రం గంగారాం జ్వరంతో బాధపడుతున్న తమ కుమారుడు గురుప్రసాద్‌ను భుజంపై ఎక్కించుకుని ప్రమాదకర పరిస్థితిలో వాగు దాటి ఇంద్రవెల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. వాగు వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు వాపోయారు. ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వాగుపై కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

కలశయాత్రకు ఘన స్వాగతం


మాజీ సైనికాధికారిని సన్మానిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధంలో 114 మంది యాదవ జవాన్లు వీరమరణం పొందారని బిహార్ రాష్ట్ర మాజీ సైనికాధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. వారి స్మారకార్థం కిరణ్‌కుమార్ చేపట్టిన రేజాంగుల రాజ్ కలశయాత్ర మంగళవారం మందమర్రికి చేరుకుంది. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం ఆధ్వర్యంలో ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఇందూ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 122 రోజుల క్రితం ప్రారంభమైన యాత్ర ఇప్పటికే 28 రాష్ట్రాలు తిరిగామన్నారు. నవంబర్ 19న ఢిల్లీలో ముగియనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెత్తుల నరేష్ యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, యశ్వంత్‌రాజ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలో ఉమామహేశ్వరుడు


నాడు ఉమా మహేశ్వరుడి ఆలయం


నేడు గోదావరినదిలో మునిగిన ఆలయం

లోకేశ్వరం: ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉధృతి పెరిగి మండలంలోని పంచగుడి సమీపంలో ఉన్న నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వర ఆలయం మంగళవారం నీట మునిగింది. ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ చేరడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. వచ్చే జనవరి వరకు మందిరం ముంపులోనే ఉండే అవకాశం ఉంది. ఏటా శివరాత్రికి ఉమ్మెడ వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు.

ముసురు మురిపెం..


ఇంటిబాట పట్టిన చిన్నారులు

ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రేపు సెలవు ఇచ్చారంటూ చిరునవ్వులు చిందిస్తూ మంగళవారం ఇంటిబాట పట్టారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


నెత్తిపై సంచి వేసుకొని ఇంటికి వెళ్తున్న చిన్నారులు